

మహిళలపై దాడులు బాధాకరం

ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

యలమంచిలి: మహిళలపై నానాటికీ దాడులు, హింస పెరగడం ఆందోళనకమని, హింస లేని సమాజ స్థాపనకు ప్రజలు సహకరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో ఈనెల 25 నుండి డిసెంబర్ పదో తేదీ వరకూ హింస వ్యతిరేక దినోత్సవాలను పురస్కరించుకుని చించినాడలో శుక్రవారం బాలికలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ.. సమాజంలో పురుషులతో పాటు సమానంగా స్త్రీలు ఉన్నప్పటికీ స్త్రీలపై హింస అనేది నానాటికి పెరుగుతుందని బాలికలపై హింస బాగా పెరిగిందని, ప్రపంచవ్యాప్తంగా ప్రతీ ముగ్గురు మహిళల్లో ఒకరు హింసకు గురవుతున్నారని ప్రత్యేకంగా మహిళలపై జరుగుతున్న హింస పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ, కోశాధికారి సరిపల్లి జయప్రద, జిల్లా కమిటీ సభ్యులు జిల్లెళ్ల ప్రశాంతి, బాతిరెడ్డి సుగుణ, విజయకుమారి పాల్గొన్నారు.

ఇ-క్రాప్‌లో నమోదైనా కొనరేం..!

ఒక రైతు నుంచి 12.50 ఎకరాల్లో ధాన్యమే సేకరణ : అధికారులు

అడ్డగోలు నిబంధనలతో రైతుల అవస్థలు

మిగిలిన పంట ఏం చేయాలంటూ రైతుల ఆగ్రహం

ఇ-క్రాప్‌లో నమోదైనా కొనుగోలు చేయకపోవడంపై తీవ్ర ఆవేదన

ఉంగుటూరు మండలంలో సమస్య తీవ్రం

ఇబ్బందికరంగా ఎకరాకు 65 సంచుల నిబంధన



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'సాగు చేసిన ప్రతి పంటా ఇ-క్రాప్‌లో నమోదు కావాలి. నమోదైతేనే రైతు నుంచి పంటను కొనుగోలు చేస్తాం. లేకుంటే పంట కొనుగోలు అసాధ్యం' అని ప్రభుత్వం, అధికారులు ఇప్పటి వరకూ ఊదరగొట్టారు. కానీ నేడు ఇ-క్రాప్‌లో పంట నమోదు చేసినా 12.50 ఎకరాల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని, మిగిలిన పంటను కొనుగోలు చేయడం కుదరదంటూ అధికారులు చెబుతున్న నిబంధన రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇదేమని అడిగినా సమాధానం చెప్పేవారు లేకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం తెచ్చిన నూతన విధానంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. ఇప్పటి వరకూ దాదాపు 70 శాతం వరకూ మాసూలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ స్థాయిలో ధాన్యం కొనుగోలు మాత్రం ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం అన్నదాతను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. తాజాగా అధికారులు చెబుతున్న కొత్త నిబంధనతో రైతులు తలలుపట్టుకుంటున్నారు. నూటికి నూరుశాతం ఇ-క్రాప్ పూర్తిచేశామని, పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు జరుగుతుందని నిన్నటి వరకూ అధికారులు చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఇ-క్రాప్ పంటలకు సంబంధించిన ధాన్యం కూడా కొనుగోలు చేయలేమంటూ అధికారులు చేతులెత్తేస్తున్న తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి ఎకరాకు సంబంధించి ఇ-క్రాప్ పూర్తిచేశామన్న అధికారులు ఇప్పుడేమో మరోలా మాట్లాడుతున్నారు. జిల్లాలో చాలా మంది రైతులకు 15 ఎకరాలు, 20 ఎకరాలు, ఆపైన భూములున్న రైతులున్నారు. ఈ భూములను అధికారులు ఇ-క్రాప్‌లో నమోదుచేశారు. రైతులు మాసూలు పూర్తిచేసి ధాన్యం తీసుకు వెళితే 12.50 ఎకరాల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని రైతుభరోసా కేంద్రంలో చెబుతున్నారు. మరి మిగిలిన ధాన్యం పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తే మాత్రం సమాధానం చెప్పడం లేదు. ఈ నిబంధన గురించి అప్పుడే చెబితే ఇంట్లో కుటుంబ సభ్యుల పేరుపై కొంత పొలం ఇ-క్రాప్ చేయించుకునేవారమని రైతులు లబోదిబోమంటున్నారు. సరికొత్త నిబంధనలతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వానికి తగదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ నిబంధనతో రెండుజిల్లాల్లోనూ అనేక మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉంగుటూరు మండలంలోని నాచుగుంట, కాగుపాడు, ఉంగుటూరుతో పాటు పలు గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. రైతుభరోసా కేంద్రాల్లో సరైన సమాధానం చెప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

తలనొప్పిగా 65 సంచుల నిబంధన

ధాన్యం కొనుగోలులో తెచ్చిన కొత్తనిబంధనలతో రైతులు తీవ్రంగా నలిగిపోతున్నారు. ధాన్యం దిగుబడి ఎక్కువగా వచ్చినా సమస్యగా మారడంతో అన్నదాతకు ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఎకరాకు 40 కిలోల బరువుగల 65 సంచులను మాత్రమే రైతుభరోసా కేంద్రాల్లో ఇస్తున్నారు. అంటే 75 కిలోల విలువ చేసే 34 బస్తాలకు మాత్రమే సంచులు ఇస్తున్నారు. కొన్నిచోట్ల ఎకరాకు 38 బస్తాలు, 40 బస్తాల దిగుబడి వస్తుంది. దీంతో రైతులు ఆనందపడాలో బాధపడాలో తెలియడం లేదు. 65 సంచుల ధాన్యం మాత్రమే రైతుభరోసా కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్నారు. అంతకు మించి ధాన్యం దిగుబడి వచ్చినా కొనుగోలు చేయడం లేదు. దీంతో ఆ ధాన్యం ఏ విధంగా విక్రయించాలో తెలీక రైతులు తలలుపట్టుకుంటున్నారు. 65 సంచుల విధానంపై రైతులు ఆదినుంచి మొరపెట్టుకుంటున్నప్పటికీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఉన్నతాధికారులు సైతం దీనిపై స్పష్టత ఇవ్వకపోవడంతో క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ధాన్యం కొనుగోలులో ఆందోళన వద్దు

జాయింట్ కలెక్టర్ మురళీ



మాట్లాడుతున్న జెసి మురళీ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జెసి జెవి.మురళి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సలహా మండలి జిల్లా అధ్యక్షులు కైగాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జెసి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం చేస్తున్న విశేష కృషికి అనుగుణంగా జిల్లాలో ఉన్న వ్యవసాయ శాఖ అధికారులు సమర్థవంతంగా పనిచేసి మంచి ఫలితాలను తీసుకురావాలన్నారు. జిల్లాకు వ్యవసాయరంగంలో మంచి పేరును తీసుకువస్తున్నందుకు వ్యవసాయ శాఖ అధికారులను, సిబ్బందిని అభినందించారు. వ్యవసాయ, రెవెన్యూ, మత్స్యశాఖ, ఇరిగేషన్, డ్రెయినేజీ తదితర శాఖలు సమన్వయంతో పని చేస్తే రైతుల సమస్యలు చక్కగా పరిష్కరించగలుగుతామన్నారు. ధాన్యం కొనుగోలులో నూతన ప్రక్రియ ద్వారా రైతులకు రవాణా సౌకర్యాల్లో ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో ఇబ్బందులను తొలగించే విధంగా వ్యవహరించాలన్నారు. జిల్లా అధ్యక్షులు కైగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు నూతన ప్రక్రియ ద్వారా ధాన్యం డబ్బులు 21 రోజుల్లో చక్కగా రైతుల ఖాతాలో జమ అవుతున్నాయన్నారు. కొన్నిచోట్ల కేవలం రెండు మూడు రోజుల్లోనే డబ్బులు ఖాతాల్లో చేరుతున్నాయని తెలిపారు. రైతులకు బరకాల సమస్య చాలా తీవ్రంగా ఉందని, కోరుకున్న ప్రతి రైతుకు బరకాలు అందించే కార్యక్రమం అధికారులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో సభ్యులు కొట్టి కుటుంబ రావు, ఉద్దరాజు విజయరామరాజు, జెడ్‌పి సిఇఒ కెవిఎస్ఆర్.రవికుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిసిఒఎం.రవి కుమార్, నాబార్డు డిడిఎం టి.అనిల్‌కాంత్, జిల్లా మత్స్యశాఖ అధికారి కెఎస్‌వి.నాగలింగాచార్యులు, జిల్లా వాటర్ రిసోర్స్ అధికారి పి.నాగార్జున రావు, డిఎస్ఒ ఎం.సరోజ, పశు సంవర్థక శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా హార్టీకల్చర్ అధికారి ఎ.దుర్గేష్, విద్యుత్ శాఖ ఇఇ ఫీర్‌అహ్మద్‌ఖాన్, కంతవపాడు కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు సాంబయ్య, సబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

మార్కెటింగ్ శాఖ కమిషనర్ ప్రద్యుమ్న




మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ కమిషనర్ ప్రద్యుమ్న

ప్రజాశక్తి - భీమవరం

రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మార్కెటింగ్ శాఖ కమిషనర్ ప్రద్యుమ్న అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్ నిర్మాణంపై సమీక్షించారు. రైతులకు కావాల్సిన విత్తనం నుండి పంట కోసి అమ్ముకునే వరకూ అన్ని వసతులు కల్పించాలన్నారు. పంట కోసిన తర్వాత ధాన్యం ఆరబెట్టేందుకు ప్లాట్ ఫారాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్స్ గొడౌన్ల అవసరమని మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్స్ గొడౌన్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతిచ్చి రాష్ట్రంలో 4,200 మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్స్ గోదాములు మంజూరయ్యాయని తెలిపారు. జిల్లాలో మొత్తం మూడు విడతల్లో 129 మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్లు మంజూరు చేయగా 78 సెంటర్లకు మాత్రమే భూములు గుర్తించారని దీనిలో 24కి మాత్రమే పనులు ప్రారంభించారని చెప్పారు. తొలుత భీమవరం కలెక్టర్ కార్యాలయానికి ప్రద్యుమ్నకు కలెక్టర్ ప్రశాంతి, జెసి జెవి.మురళీ, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సమావేశంలో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ దాసిరాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల, మార్కెటింగ్ శాఖ ఆర్‌జెడి కె.శ్రీనివాసరావు, జిల్లా కోపరేటివ్ అధికారి ఎం.రవికుమార్, డ్వామా పీడీ రాజేశ్వరరావు, మార్కెట్ మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

అద్దె బస్సులను నియంత్రించాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్



డిపో మేనేజర్‌కు వినతిని అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - తణుకురూరల్

అద్దె బస్సులను ఆపాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిపో మేనేజర్ పిఎన్‌విఎం.సత్యనారాయణమూర్తికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్‌టిసి బస్సులకన్నా ప్రయివేటు బస్సుల సంఖ్యను యాజమాన్యం పెంచిందన్నారు. దీని వల్ల మిగులు కార్మికులుగా ప్రభుత్వానికి చూపిస్తున్నారన్నారు. కార్మికులు ఒక డిపో నుండి మరో డిపోలోకి దౌర్జన్యంగా బదలాయిస్తున్నారని, కార్మికులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. మచిలీపట్నం డిపోలో 58 బస్సులు ఆర్‌టిసికి ఉంటే ప్రయివేటు బస్సులు 52 ఉన్నాయన్నారు. సంస్థను ప్రయివేటుపరం చేసే దిశగా యాజమాన్యం ఉందన్నారు. బడ్జెట్‌లో రూ.408 కోట్లు కేటాయించిందని, ఆ సొమ్ముతో కొత్తగా యాజమాన్యమే బస్సులను కొనుగోలు చేయొచ్చన్నారు. ఆర్టీసి కార్మికులకు 2020 నుండి 2021 వరకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కోసం ఆదేశాలు ప్రభుత్వం ఇచ్చినా యాజమాన్యం ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగుల, కార్మికుల లీవ్ ఖాతా నుండి సెలవులు కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు దసరా పండుగలకు 15 నెలలు పూర్తి అయినా నేటికీ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఇవ్వలేదని తెలిపారు. 2017-18 సంవత్సరాలకు చెల్లించాల్సిన బకాయిలు కూడా చెల్లించలేదని శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు కామన మునిస్వామి, డిపో అధ్యక్షులు ఎ.ప్రసాద్, జిల్లా అధ్యక్షులు టివిఎస్.మూర్తి, జిల్లా ప్రచార కార్యదర్శి ఆర్‌ఎన్‌బి.దుర్గారావు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

రాజ్యాంగ దినోత్సవాన్ని నవంబర్ 26న నిర్వహించుకోవడం 2015 నుంచి ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేద్కర్ నేతృత్వంలోని డ్రాఫ్ట్ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగం రూపొందించిన అనంతరం భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు 1950 జనవరి 26 అని తెలిపారు. అందుకే 1950 జనవరి 26న గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడానికి రెండేళ్లకు పైనే సమయం పట్టిందన్నారు. ఏటా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవాలని, రాజ్యాంగం గొప్పదనాన్ని తెలిపే ప్రసంగాలు, ఉపన్యాసాలు, వ్యాసరచన వంటి కార్యక్రమాలను ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలన్నారు.

ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా జాయింట్ కలెక్టర్ మురళి

ప్రజాశక్తి - భీమవరం

ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా జాయింటు కలెక్టర్ జెవి మురళి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జెసి జిల్లాలోని తహశీల్దార్లతో ప్రాధానాంశాలపై సమీక్షించారు. స్వమిత్ర, భూ రీసర్వే, ఇళ్ల పట్టాల పంపిణీ, భూ హక్కు పత్రాలు, స్పందన తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ సర్వే పూర్తయిన వారికి భూ హక్కు పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని, మండలాల వారీగా కొంతమంది వాలంటీర్లను నియమించి వారి ఈ మెయిల్స్‌తో యాప్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ దాసి రాజు, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల, తహశీల్దార్లు పాల్గొన్నారు.

బిజెపికి బుద్ధి చెప్పాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి గోపాలన్

ప్రజాశక్తి - ఆకివీడు

బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న నీతిమాలిన రాజకీయాలను ప్రజలు గమనించి బుద్ధి చెప్పాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ పిలుపునిచ్చారు. శుక్రవారం బిజెపి అరాచక పాలన అనే అంశంపై దొరగారి చెరువుగట్టు రోడ్డుపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బహిరంగ అధ్యయన వేదిక కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి తవిటినాయుడు అధ్యక్షతన జరిగిన సభలో గోపాలన్ పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై అనేక ధరల భారాలు వేస్తోందన్నారు. లౌకికవాదంతో బతుకుతున్న ప్రజలను మతం పేరుతో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. కార్మిక హక్కులను, బ్రిటీష్ కాలం నాటి చట్టాలను తిరిగి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ రకమైన బిజెపి విధానాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్, ఐద్వా పట్టణ కార్యదర్శి ఎస్.ఉదయ కుమారి, ప్రజా సంఘాల కార్యకర్తలు సందక సూరిబాబు, నక్కాని నారాయణ, నెల్లి.సూరిబాబు, జి.ఆదినారాయణరావు పద్మారావు పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంతో ముందుకుసాగాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మహిళలు, బాలికల్లో సమస్యను చెప్పగలిగే నేర్పరితనం, ఫిర్యాదు చేసే ధైర్యం ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం బివి రాజు కళాశాల సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళల హింస నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మన కళ్లముందే ఒక మహిళకు అన్యాయం జరిగినప్పుడు దాన్ని అందరూ సామూహికంగా ఖండించడంతో పాటు బాధితురాలు పూర్తిస్థాయిలో సంఘీభావం తెలిపి ఆమె తరపున ధైర్యంగా పోరాడాలని సూచించారు. ప్రతి పాఠశాలల్లో చైల్డ్ లైన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దానిపై అవగాహన లేక ఎవరూ ఫిర్యాదులు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, బాలికల హెల్ప్ లైన్ నంబర్ పోస్టర్‌ను, ఇంటర్నేషనల్ డే ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ వైలెన్స్ ఎగైనెస్ట్ ఉమెన్స్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ బూసి వినిత, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శోభారాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పుష్పరాణి, బివి.రాజు కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

కఠిన చట్టాలు అమలు చేయాలి

సీనియర్ మహిళా న్యాయవాది సత్యవిజ్ఞాన దేవి




న్యాయవాది ఎన్.సత్య విజ్ఞాన దేవిని సత్కరిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మహిళలపై అత్యాచారాలు, దాడులు జరిగిన సమయంలో అందుకు బాధ్యులపై కఠిన చట్టాలు అమలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీనియర్ మహిళా న్యాయవాది ఎన్.సత్య విజ్ఞాన దేవి పేర్కొన్నారు. శుక్రవారం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న దాడులు ఎలా అరికట్టాలి అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. సదస్సుకు ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఇన్‌ఛార్జి డాక్టర్ పి.భువనేశ్వరి అధ్యక్షత వహించారు. ఎన్ని చట్టాలున్నా మహిళలపై దాడులు మాత్రం తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమశిక్షణతో పెంచాలని తెలిపారు. మహిళలపై దాడులు విషయంలో యువతి యువకుల్లో కూడా మార్పు రావాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడారు. విద్యార్థులు మనసులోకి చెడు ఆలోచనలు రానివ్వకుండా ఉన్నత లక్ష్యాలే సాధనగా ముందుకు సాగాలన్నారు. కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి రంగరాజు మాట్లాడుతూ చెడుబాట పట్టి యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఇన్‌ఛార్జి బిఎన్.లక్ష్మి, డాక్టర్ అపర్ణ, శశికళ, డాక్టర్ పి.భువనేశ్వరి పాల్గొన్నారు. అనంతరం న్యాయవాది సత్య విజ్ఞాన దేవిని సత్కరించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని..

ఎంఇఒ కార్యాలయం ముట్టడి



ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి - పెనుగొండ

మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం గుర్తించి వారికి కనీస వేతనం, సామాజిక భద్రత కల్పించాలని సిఐటియు డిమాండ్ చేసింది. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యాశాఖ అధికారి కార్యాలయాలన్ని ముట్టడించారు. అనంతరం విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎ.అజయకుమారి మాట్లాడుతూ ధరల పెరుగుదలను అరికట్టాలని, పథకం బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. వారిని కార్మికులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వర్కర్లకు, హెల్పర్లకు నెలకు రూ.26 వేల కనీస వేతనం నిర్ణయించి, పని గంటల ప్రకారం దాన్ని అమలు చేయాలని కోరారు. బిల్లులు, వేతనాలు ప్రతినెలా 5వ తేదీలోపు చెల్లించాలన్నారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, నాణ్యమైన బియ్యం, సరుకులు సివిల్ సప్లైయ్ ద్వారా పాఠశాలలకు అందించాలన్నారు. వర్కర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, కార్మికుల అధ్యక్షులు మన్నే వెంకట్రావు, కోళ్ల విజయలక్ష్మి, వెలిచేటి శ్రీలక్ష్మి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి : సిపిఎం



మాట్లాడుతున్న కేతా గోపాలన్


ప్రజాశక్తి - యలమంచిలి

జగనన్న ఇళ్ల పథకంలో పేదలందరికీ రూ.1.80 నుంచి రూ.3 లక్షలకు పెంచి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం జిల్లా నేత కేతా గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చించినాడ శెట్టిబలిజపేట కమ్యూనిటీ హాల్ వద్ద సిపిఎం కార్యకర్తల ప్రాంతీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పేదలందరికీ 30 లక్షల ఇళ్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారని అయితే ఇప్పటివరకూ కనీసం లక్షా యాభై వేల ఇళ్లు కూడా నిర్మించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చిత్త శుద్ధితో పేదలకు ఇళ్లు నిర్మించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శిక్షణా తరగతుల్లో మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, సీనియర్ నాయకులు వలవల శ్రీరామ్మూర్తి, కేతా సూర్యారావు, మాసవరపు సుబ్బారావు, దేవ సుధాకర్, తెన్నేటి సంపతరావు సరిపల్లి జయప్రభ, బాతిరెడ్డి సుగుణ, జిల్లెల్ల ప్రశాంతి పాల్గొన్నారు.

అర్హులకు ఓటు హక్కు తప్పనిసరి

ప్రజాశక్తి - మొగల్తూరు

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి ఓటు హక్కునూ నమోదు చేయాలని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ బిఎల్‌ఒలకు సూచించారు. ఆయన రెవెన్యూ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బిఎల్‌ఒల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి ఒకటి 2023 నాటికి 18 సంవత్సరాల నిండిన అందరికీ ఓటు హక్కు కల్పించి అవసరమైన పత్రాలను స్వీకరించాలన్నారు. మృతి చెందిన, గ్రామంతరం వెళ్లిన వారి ఓట్లను సరైన విచారణ చేసి అనర్హులను తొలగించాలని సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ జి.అనిత కుమారి, డిపి నరేష్, ఇఒపిఆర్‌డి ఎం.నవీన్ కిరణ్ ఉన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

సంక్షేమ పథకాల అమలు ఘనత జగన్‌దే

ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - పోడూరు

పండితవిల్లూరులో 82వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో శుక్రవారం ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకుని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు ఎంతో మేలు చేసే పథకాలను ప్రవేశపెట్టారన్నారు. పథకాల అమలు ఘనత జగన్‌దే అన్నారు. దేశంలో ఏ ప్రభుత్వమూ ప్రవేశపెట్టని ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ముఖ్యమంత్రిపై దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సబ్బితి సుమంగళి, సర్పంచ్ ఇళ్ల లక్ష్మీ చంద్రిక, ఎంపిటిసి ఇందుకూరి లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఈ నెల 27వ తేదీ ఆదివారం పక్షవాతం, ఫిట్స్ బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అందరికీ వైద్య సహాయం అందించాలన్న ఆలోచనతో అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్యశాల కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. విజయవాడకు చెందిన డాక్టర్ గోపాల శివన్నారాయణ క్యాంపులో మన హాస్పిటల్ వైద్యులు డి.సందీప్‌వర్మ తదితరులు పాల్గొని వైద్య సేవలందిస్తారని తెలిపారు. తక్కువ ధరలకే అవసరమైన మందులను నెలవారీగా అందిస్తున్నారన్నారు. వైద్య శిబిరానికి వచ్చేవారు ముందురోజు బిపి, షుగర్ పరీక్షలను బయట చేయించుకుని ఆ రిపోర్టులు తీసుకుని మెడికల్ క్యాంపునకు రావాలన్నారు. అలాగే పాత రిపోర్టులు తేవాలన్నారు. క్యాంపు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

పాఠశాలకు కుక్కర్, మిక్సీ అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని జివిఎస్‌విఆర్ మున్సిపల్ పాఠశాలకు మధ్యాహ్న భోజనం నిమిత్తం కుక్కర్, మిక్సీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ జోగి వెంకటేశ్వరరావు అందజేశారు. దాత జోగి మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎంసి వైస్ ఛైర్ పర్సన్ శరత్ చంద్ర, ట్రస్ట్ సభ్యులు లక్ష్మీ, సుభద్ర, మల్లేశ్వరరావు, నాగరాజు, ఎంఎస్ కోఆర్డినేటర్ టి.జనార్దన్, వల్లా ముత్యం, పులపర్తి రాఘవయ్య నాయుడు, హెచ్ ఎం రాయపూడి భవాని ప్రసాద్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి విఘాతం కలిగించే వారిపై..

చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కాళ్ల

మతసామరస్యానికి విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని ఫ్రీడమ్ ఫర్ క్రిస్టియన్ ఇంటిగ్రిటీ స్టేట్ వెల్ఫేర్ ప్రెసిడెంట్ ఎండి ఇస్మాయేల్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. తాడేపత్రి పట్టణం సంజీవ్ నగర్‌లో కొంతమంది క్రైస్తవుల వీధి సువార్త చేసుకుంటూ, కరపత్రాలు బైబిల్ పంచుతూ, ర్యాలీగా వెళుతుండగా కొంతమంది మతోన్మాదులు వారిని కొట్టి బైబిల్‌ను తగలబెట్టి కారు ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. ఇలాంటి సంఘ విద్రోహ చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎఫ్‌సిఐ ప్రొటెక్షన్ మండల అధ్యక్షులు పి.సుందర్‌రావు, వెల్ఫేర్ ప్రెసిడెంట్ వై.సాల్మన్‌రాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పెదపుల్లేరులో డ్రైడే

ప్రజాశక్తి - ఉండి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్తులకు పెదపుల్లేరు ఎఎన్ఎం దయావతి సూచించారు. శుక్రవారం పెదపుల్లేరు గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎన్ఎం దయావతి మాట్లాడుతూ ప్రస్తుత శీతాకాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉందని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని సూచించారు. మురుగునీరు ఎక్కువగా నిల్వ ఉండటం వల్ల మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలు ప్రబలుతాయన్నారు. దోమ తెరలు వాడడం, మురుగునీరు నిల్వ లేకుండా చూడడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.రవి, రెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

సోడా బండిని ధ్వంసం చేశారంటూ నాగేశ్వరరావు ఆవేదన

ప్రజాశక్తి - మొగల్తూరు

తన సోడా బండిని కొంత మంది ధ్వంసం చేశారని, తనకు న్యాయం చేయాలని రామల బందరువుకు చెందిన మోకా నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం నాగేశ్వరరావు విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. మొగల్తూరు పంచాయతీ పరిధి గరువు వల్లవపాలెంలోని కాలవ గట్టుపై 40 సంవత్సరాలుగా సోడా బడ్డీ నిర్వహించుకుంటూ ఉపాధి పొందుతున్నానని తెలిపాడు. నేను, నా భార్య అనారోగ్యానికి గురయ్యామని తెలిపాడు. అయితే నా సోడా బండిని గ్రామానికి చెందిన అడ్డంకి కృష్ణ, రేవు యేసు, అడ్డంకి నరసింహస్వామి, కర్రీ సూర్యనారాయణ ,బర్రి పెద్దిరాజు, మోకా రాంబాబు, బర్రి భరత్, రేవు నాగరాజు, అడ్డంకి పోతురాజు తదితరులు ధ్వంసం చేసి, అందులోని సామగ్రిని కాలువలోకి పడేశారని ఆవేదన చెందాడు. దీంతో తాను ఉపాధి కోల్పోయానని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపాడు. దీనిపై విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరాడు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

మొగల్తూరు:మొగల్తూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిషేధ జాబితాలో ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేశారని సబ్ కలెక్టర్ ఎం సూర్య తేజ తెలిపారు. శుక్రవారం మొగల్తూరు వచ్చిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రాత్రి వరకు ఆయన తనిఖీలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. శేరేపాలెం కెపిపాలెం, ముత్యాలపల్లి, మొగల్తూరు, పేరుపాలెం గ్రామాలకు చెందిన భూములలో 111 రిజిస్ట్రేషన్ జరిగాయన్నారు. 47 ఎకరాల వ్యవసాయ భూములతో పాటు 11,727 చదరపు గజాలు భూమి లకు రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. ఈ తనిఖీల్లో తహశీల్దార్ జి.అనిత కుమారి డిటి నరేష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ విజయ్ పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

యువత మంచి మార్గంలో నడవాలి

భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్

ప్రజాశక్తి - కాళ్ల

యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా మంచి మార్గంలో నడవాలని భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోపల్లె వంతెన వద్ద అనుమానితులుగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించామని, వారి వద్ద నుంచి 320 గ్రాముల గంజాయి ప్యాకెట్లు, రెండు సెల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్, స్వాధీన పర్చుకున్నామని తెలిపారు. ఏలూరుపాడు శివారులో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రెండు మోటార్ సైకిళ్లు, 9 సెల్ ఫోన్లు, ఒక లాప్‌టాప్, టీవీ, రూ.12,500 నగదు స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సర్కిల్ సిఐ గీతా రామకృష్ణ, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.మల్లికార్జునరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీనాథ్

దిశా యాప్‌పై అవగాహనుండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మహిళలు దిశా యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ అప్పారావు తెలిపారు. స్థానిక డిఎన్ఆర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు దిశా యాప్‌పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం రెండో పట్టణ ఎస్ఐ అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి కళాశాలకూ వెళ్లి విద్యార్థినులకు దిశా యాప్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థినులకు ఈ యాప్ అండగా ఉంటుందన్నారు. కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు) మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ దిశా యాప్‌ను తమ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఈ యాప్ వజ్రాయుధంగా ఉపయోగపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.అంజన్న కుమార్ మాట్లాడుతూ దిశా యాప్ విద్యార్థులకు మంచి ఆయుధమన్నారు. ఇలాంటి యాప్ వల్ల తల్లిదండ్రులు స్వేచ్ఛగా తమ పిల్లలను అని రంగాల్లోనూ ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ బాడీ మెంబెర్ కె.శివరామరాజు, డిఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఎఒ పి.రామకృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బివిఎస్ వర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ అప్పారావు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఎంఇఒ హనుమ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఇఒ వి. హనుమ తెలిపారు. ఎంపిడిఒ సమావేశ మందిరంలో ఎంఇఒ హనుమ అధ్యక్షతన మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్న విద్యా కానుక, బయోమెట్రిక్ వంద శాతం పూర్తి చేయాలన్నారు. బడి బయట పిల్లలను బడి చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీని కోసం ప్రతి గ్రామంలో కమిటీలు నియమిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం అమలు చేసి, నాణ్యతతో కూడిన భోజనాన్ని పిల్లలకు అందించాలన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఆయా హాజరను ప్రతి నెలా యాప్‌లో నమోదు చేయాలని, విద్యార్థులకు అందించే కోడిగుడ్లు, చిక్కీలను కేటాయించిన విధంగా నెలకు 4 సార్లు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదు బాక్స్‌ను ప్రతి నెలా 15వ తేదీ, 30 తేదీన సంబంధిత కమిటీ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు సూచించారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మహేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌సిడిసి, ఎస్ఎఎన్ఎస్ సర్వేలు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. ఆసుపత్రిలోని దస్త్రాలను, ఓపి వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సిహెచ్ వి.రంగం నాయుడు, స్వర్ణ రంజని, నాగేశ్వరరావు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలని ప్రచారం

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ నాయకులు ఇంటింటికీ వెళ్లి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. యుటిఎఫ్ మొగల్తూరు మండల శాఖ ప్రధాన కార్యదర్శి కె.బ్రహ్మయ్య, సిపిఎస్ నర్సాపురం డివిజన్ కన్వీనర్ శ్యాంసన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసినట్లు రాష్ట్ర కౌన్సిలర్ చింతపల్లి కృష్ణమోహన్ తెలిపారు. ఈ నెల 27న ఆదివారం భీమవరంలో జరగబోయే 10 కే వాక్ లో మండలంలోని ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు వై.ధర్మారావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - పాలకొల్లు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్ ఆధ్వర్యంలో ఉమ్మడి అండర్ -14, అండర్-17 జిల్లా టెన్నిస్ జట్ల ఎంపిక స్థానిక టౌన్ హాల్ ప్రాంగణంలో శుక్రవారం జరిగాయి. హోరాహోరీగా జరిగిన అండర్ - 14 బాయ్స్ విభాగంలో దుర్గ సాయి అఖిల్ (పాలకొల్లు), వైఎస్ఆర్ శశాంక్ (తణుకు), ఆర్.శ్రీహిత్ (పాలకొల్లు) ఎంపికయ్యారు. బాలికల విభాగంలో పి.కీర్తన (ఏలూరు), ఎన్.లేఖశ్రీ (పాలకొల్లు), జి.స్పార్కిల్ ఏంజిలిన్ (నర్సాపురం), అండర్-17 బాలుర విభాగంలో కె.వినయ్‌కుమార్ (భీమవరం), జి.గోపీ (భీమవరం), బాలికల విభాగంలో ఫణిలక్ష్మి (తణుకు), ఆర్.మేఘన (పాలకొల్లు), జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర జట్టులో చోటు సాధించారు. ఎస్ఎఫ్ సెలక్షన్ కమిటీ సభ్యులుగా రేలంగి రామకృష్ణ, పి.నాగ మల్లేశ్వరరావును ఎంపిక చేశారు. ఈ టోర్నమెంట్లో ముఖ్య అతిథులుగా పోలిశెట్టి రాధాకృష్ణ, కొటికలపూడి కృష్ణ, ఎం.అనురాధ, రావూరి రామ్మోహన్ రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కళ్యాణ్, రమ్యకృష్ణ, మల్లేశ్వరరావు, టౌన్ హాల్ టెన్నిస్ కోచ్ కిరణ్ కుమార్, శంకర్, స్వామి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు తెలిపారు. వైఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎంబర్ మన్నారు స్వామి గుడి (కేవేల) ముందు ఉన్న కొలను చుట్టూ మొక్కల నాటే కర్యక్రమాన్ని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, మేనేజర్, ఎ.కృష్ణారెడ్డి, కోవెల గుడికి అవసరమైన శ్రీగంధం, పారిజాతం, తులసి, మొదలగు 50 మొక్కలను సమకూర్చారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ కనకారావు, డీన్ గంధం శ్రీరామ కృష్ణ, ఇంగ్లీష్ విభాగం హెడ్ సిహెచ్ సోమేశ్వరి పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న చినమిల్లి సత్యనారాయణరావు

మోడీలో మోటార్ సైకిల్ ర్యాలీ

గడపగడపకూ మన ప్రభుత్వంలో నేతలకు నీరాజనాలు

ప్రజాశక్తి - కాళ్ల

మోడీ గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం చేపట్టి 100 రోజులు పూర్తయిన సందర్భంగా వైసిపి నాయకులు తొలుత జువ్వలపాలెం రోడ్డు నుంచి మోడీ వరకూ పెద్ద ఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్ నరసింహరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజుకు జువ్వలపాలెం గ్రామం వద్ద భాజా భజంత్రీలతో బాణసంచా పేలుస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. ఉండి, ఆకివీడు, పాలకోడేరు, కాళ్ల మండలాల నుంచి వైసిపి నాయకులు కార్యకర్తలు మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. మోడీలో మహిళలు హారతులిచ్చారు కలవపూడి సొసైటీ అధ్యక్షులు పెన్మెత్స దుర్గా ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో పివిఎల్ నరసింహరాజుకు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెన్మెత్స విశ్వనాథరాజు, పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, గణేశ్న రాంబాబు, వేగేశ్న బాల గణపతి వర్మ, సాగిరాజు హరివర్మ , కఠారి లక్ష్మీపతి రాజు, దాట్ల శ్రీనివాసరాజు, ఉండి, ఆకివీడు, పాలకోడేరు, కాళ్ల మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజా ప్రతినిధులకు హారతులిస్తున్న మహిళలు

రసాభాసగా మండల పరిషత్ సమావేశం

అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని ప్రజా ప్రతినిధుల విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ జగన్నాథరావు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో వివిధ గ్రామాల్లో జరుగుతున్న పలు అభివద్ధి పనులకు ప్రోటోకాల్ పాటించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, వైస్ ఎంపిపి ఎర్రగుప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు అధికార, ప్రతిపక్ష నాయకులు మధ్య ఫోటో కాల్ వివాదం రాజుకుంది. మండలంలో వివిధ గ్రామాల్లో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు సర్పంచులు, ఎంపిటిసిలు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలను అధికారంగా పిలవాల్సి ఉన్నప్పటికీ అధికారులు కొంతమంది నాయకుల మాటలు విని తమను పిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిపి సూర్య కుమార్ మాట్లాడుతూ మండల పరిషత్ ద్వారా రూ.కోటి రూపాయలతో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదన చేసినట్లు తెలిపారు ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య మాట్లాడుతూ సమాజాభివృద్ధికి పాటుపడేవారిని కూడా ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం పరిపాటని తెలిపారు. జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు సబ్సిడీపై మోటార్లు, బరకాలు, ఎరువులు పురుగుమందులు ఇవ్వడం లేదని ఆరోపించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎర్రగుప్పుల నాగరాజు మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో సౌకర్యాలు కల్పించాలన్నారు. మరో వైస్ ఎంపిపి తాళం శ్రీనివాస్ మాట్లాడుతూ వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 9 గ్రామాలు ఉన్నాయని వీటిలో అనేక గోదావరి లంక ప్రాంతాలు కూడా ఉన్నాయని వీటికి తగినంత సిబ్బంది లేకపోవడం వల్ల ప్రజల అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మండల పశు వైద్యాధికారి ఫణి కుమార్ మాట్లాడుతూ 1962 టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉందని, రైతులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆర్అండ్‌బి ఎఇ ప్రసాద్ ప్రస్తుతం కరుగోరుమిల్లి, నెల్లివారిపేట మధ్య ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఇరిగేషన్ ఎఇ సల్లపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎంఇఒ శ్రీనివాస్, ఎస్ఐ ప్రసాద్, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ మూర్తిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం : జనసేన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మత్స్యకారులకు జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పార్టీ నరసాపురం నియోజక వర్గ నాయకుడు బొమ్మిడి నాయకర్ తెలిపారు. జనసేన ఆధ్వర్యంలో శ్రీకాకుళం నియోజకవర్గం కె.మత్స్యలేసం గ్రామంలో ఆయన శుక్రవారం పర్యటించారు. ఇటీవల పాకిస్తాన్‌లో చిక్కుకొని ఇండియా తిరిగివచ్చిన మత్స్యకారులను జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి జనసేన పాటుపడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బందెల రవీంద్ర, తోట నాని, యడ్లపల్లి మహేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని డ్వామా పీడీ ఎస్‌టివి రాజేశ్వరరావు సూచించారు. ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్లాన్‌పై డివిజనల్ పరిధిలోని అధికారులతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ వివిధ పథకాల రూపంలో మంజూరు చేస్తున్న నిధులను సకాలంలో సక్రమంగా వినియోగిస్తే సమస్యలు పరిష్కారంతోపాటు అభివృద్ధికి బాటలు వేసే అవకాశం ఉందన్నారు. గ్రామస్థాయిలో పథకాలను ఏ విధంగా పూర్తిస్థాయిలో అమలు చేయాలి, అసాంఘిక కార్యక్రమాల నిరోధం, డ్రగ్స్ నుంచి యువతను దూరం చేయడం వంటి అంశాలపై డిఎల్డివోస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్-ఎస్ఆర్ ప్రభు, జ్యోతిర్మయి, డిఎల్‌డిఒస్ అప్పారావు, కిషోర్, కుమార్, టిఎ.ప్రకాష్ పాల్గొన్నారు.

స్త్రీలు ఆత్మస్థయిర్యం కలిగి ఉండాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని హైకోర్టు న్యాయవాది పోలిశెట్టి రాధాకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలు ఆత్మస్థైర్యాన్ని కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా స్త్రీలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా కఠిన శిక్షలు అమల్లోకి రావాలన్నారు. సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను చిన్న రూపకంలో విద్యార్థినులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హేమలత, శిరీష, సంధ్య, అమిత, మహాలక్ష్మి, నోబుల్ రాజ్ పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చనివ్వబోం : జనసేన

ప్రజాశక్తి - ఆకివీడు

ఉప్పుటేరు దగ్గరలోని పోరంబోకు స్థలాల్లో నివసిస్తున్న వారి ఇళ్లను జాతీయ రహదారి అధికారులు కూల్చివేసేందుకు శుక్రవారం ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా అక్కడకు చేరారు. దీంతో కొద్దిసేపు అక్కడ గందరగోళ వాతావరణం ఏర్పడింది. అర్ధ దశాబ్దానికి పైగా అక్కడ నివాసముంటున్న ఏడు కుటుంబాలను ఖాళీ చేయాల్సిందిగా గత జనవరిలో అధికారులు వారికి నోటీసులు జారీ చేశారు. అప్పట్లోనే జనసేన నాయకులు, స్థానిక ఎమ్మెల్యే జాతీయ రహదారి అధికారులను అడ్డుకున్నారు. ఇప్పుడు మరోసారి జాతీయ రహదారి అధికారులు ముందుకొచ్చారు. తమ ఇళ్లను అక్రమంగా తొలగించేందుకు అధికారులు ప్రయత్నించడం దారుణమని అక్కడ నివాసితులు వాపోయారు. జనసేన జిల్లా కార్యదర్శి గవర లక్ష్మి మాట్లాడారు. బాధితులకు ప్రత్యామ్నాయంగా నివాస గృహాలను చూపించిన తర్వాత మాత్రమే ఈ పనులకు పూనుకోవాలన్నారు. దీంతో జెసిబితో ఇల్లు కూల్చడానికి అక్కడికి వచ్చిన అధికారులు తోక ముడిచారు. జనసైనికులు సాయంత్రం వరకూ ఆ స్థలాల వద్ద టెంట్ వేసుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో బాధితులతో పాటు దుంపగడప గ్రామ సర్పంచి విశ్వేశ్వరరావు, ఉపసర్పంచి నాగరాజు పాల్గొన్నారు.